సాక్షి ఖమ్మం

మంగళవారం ; 4 ; ఫిబ్రవరి ; 2025



మిర్చి రైతుకు ధరాఘాతం

ఖమ్మం మార్కెట్‌కు రోజురోజుకు మిర్చి తీసుకొస్తున్న రైతుల సంఖ్య పెరుగుతుండగా ధరలో పురోగతి కానరావడం లేదు. 8లో



ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

గ్రీవెన్స్ డేలో అందే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీజ అధికారులను ఆదేశించారు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 17°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం మంచు ప్రభావం ఉంటుంది. అయితే, మధ్యాహ్నానికి మాత్రం ఎండ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పూర్తి సమాచారంతో 'క్రాప్ బుకింగ్'



వివరాల నమోదును పరిశీలిస్తున్న డీఏఓ

వైరా: రైతులు సాగు చేసే ప్రతీ పంట సమాచారంతో డిజిటల్ క్రాప్ బుకింగ్ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య సూచించారు. వైరా మండలంలోని సోమవరంలో ఉద్యోగులు యాప్‌లో పంటల వివరాలను నమోదు చేస్తుండగా డీఏఓ పరిశీలించి మాట్లాడారు. రైతులు సాగు చేసిన పంటలకు అనుగుణంగా ఎరువులు సమకూర్చడం, దిగుబడి ఆధారంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయడానికి ఈ వివరాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈమేరకు రైతులు పూర్తి సమాచారం అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏఓ మయాన్ మంజుఖాన్, ఏఈఓలు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు చెల్లింపునకు అవకాశం

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ చదివిన అభ్యర్థులు అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించే అవకాశముందని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. పదో తరగతి అభ్యర్థులు సబ్జెక్టుకు రూ.50 చొప్పున అపరాధ రుసుముతో థియరీకి సబ్జెక్టుకు రూ.100, ప్రాక్టికల్ సబ్జెక్టుకు రూ.100, ఇంటర్ అభ్యర్థులు థియరీకి సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్ సబ్జెక్టుకు రూ.150 చొప్పున ఈనెల 10వ తేదీ లోపు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అలాగే, తత్కాల్ స్కీమ్ ద్వారా సాధారణ ఫీజుతో పాటు అదనంగా పదో తరగతి వారైతే రూ.500, ఇంటర్ విద్యార్థులైతే రూ.1,000 చొప్పున ఈనెల 11నుండి 13వ తేదీ లోపు చెల్లించే అవకాశముందని తెలిపారు.

శరవేగంగా మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు




పనులపై సమీక్షిస్తున్న అధికారులు

ఖమ్మంఅర్బన్: రఘునాథపాలెం మండలంలోని ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేలా ఎన్నెస్పీ ప్రధాన కాల్వపై మంచుకొండ ఎత్తిపోతల పథకం నిర్మాణపనులు చకచకా కొనసాగుతున్నాయి. రూ.66కోట్ల వ్యయంతో నిర్మించే ఈ పథకానికి గత నెలలో ఐదుగురు మంత్రులు శంకుస్థాపన చేయగా, వచ్చే ఉగాది నాటికి సాగర్ జలాలను అందించాలనే లక్ష్యంతో పనుల్లో వేగం పెంచారు. పైపులైన్, పంప్‌హౌస్ నిర్మాణ పనులు సమాంతరంగా చేపడుతున్నారు. ఈనేపథ్యాన పనులను జలవనరుల శాఖ ఎస్ఈ మంగళపుడి వెంకటేశ్వర్లు, ఈఈ అనన్య, డీఈ ఝాన్సీ మంగళవారం పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఏఈలు శ్రీరాం, సతీష్, కిరణ్ తదితరులు ఉన్నారు.

ప్రొబెషనరీ ఎస్సైలకు పోస్టింగ్

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌కు కేటాయించిన తొమ్మిది మంది ప్రొబెషనరీ ఎస్సైలకు వివిధ స్టేషన్లలో పోస్టింగ్ ఇచ్చారు. ఐదు నెలల శిక్షణలో భాగంగా వీరిని పోలీస్‌స్టేషన్లకు కేటాయిస్తూ పోలీసు కమిషనర్ సునీల్ దత్ ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బాదావత్ హరికృష్ణ, రఘునాథపాలెంకు తేజస్వర్‌రెడ్డి, సత్తుపల్లికి గద్దాల అశోక్‌కుమార్, ఖమ్మం వన్‌టౌన్‌కు పోడలి రామకృష్ణ, వైరాకు వెంపటి పవన్, ఖమ్మం త్రీటౌన్‌కు కొండా సురేష్, తల్లాడకు బానోతు వెంకటేష్, ఖమ్మం టూటౌన్‌కు వానంపల్లి రమేష్, ఖానాపురం హవేలీ స్టేషన్‌లో నవితకు పోస్టింగ్ ఇచ్చారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం



పరీక్షను పర్యవేక్షిస్తున్న డీఐఈఓ రవిబాబు

ఖమ్మంసహకారనగర్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం మొదలయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జనరల్, ఒకేషనల్ అభ్యర్థులకు వేర్వేరు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం సెషన్‌లో 3,117 మందికి 2,912 మంది, మధ్యాహ్నం పరీక్షలకు 2,674 మందిలో గాను 2,578 మంది హాజరయ్యారు. పలు కేంద్రాల్లో పరీక్ష నిర్వహణను డీఐఈఓ రవిబాబు పరిశీలించారు.

పర్యాటక సొబగులు





పులిగుండాల ప్రాజెక్టు వ్యూ పాయింట్ (ఇన్‌సెట్) బర్డ్స్, లియోపర్డ్ వాచ్ టవర్

జిల్లాలో పర్యాటకానికి మరింత సొబగులు అద్దేలా అటవీశాఖ ఎకో టూరిజం ప్రాజెక్టుకు అంకురార్పణ చేసింది. ఇందులో భాగంగా పులిగుండాల, పల్లేర్ల బావి, కనకగిరి అడవుల సర్క్యూట్‌ను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకట్టుకునేలా ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే ఏర్పాట్లు చివరి దశలో ఉండగా ఈనెల 15న ప్రారంభించాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగానే కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్‌తో కూడిన బృందం జనవరి 29న పులిగుండాల ప్రాంతాన్ని సందర్శించి అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించింది.

– ఖమ్మంవన్‌టౌన్

త్వరలోనే అందుబాటులోకి పులిగుండాల, కనికగిరి సర్క్యూట్

- ట్రెక్కింగ్, సఫారీ, బోటింగ్, రాత్రి బసకు ఏర్పాట్లు
- ఐటీడీఏ ద్వారా స్త్రీ శక్తి క్యాంటీన్లు కూడా..
- ఈనెల 15నాటికి పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ

14వేల హెక్టార్లలో సర్క్యూట్

కొండలు, పక్షుల కిలకిలారావాలు, కనుచూపు మేరలో పచ్చదనంతో కనకగిరి అడవులు విస్తరించి ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఏన్కూరు, కల్లూరు, చంద్రుగొండ, జూలూరుపాడు, సుజాతనగర్ మండలాలతో పాటు సత్తుపల్లి అటవీ డివిజన్ తల్లాడ రేంజ్ పరిధి, పెనుబల్లి మండలం బ్రహ్మళకుంట సమీపం వరకు 14వేల హెక్టార్లలో ఈ అటవీ ప్రాంతం ఉంటుంది. ఇందులో 51ఎకరాల విస్తీర్ణం కలిగిన పులిగుండాల ప్రాజెక్టు సాగునీటి అవసరాలతో పాటు అటవీప్రాంతంలోని వన్యప్రాణుల దాహార్తిని తీరుస్తోంది.

ఆదాయమార్గాలు...

జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధితో స్థానికులకు ఆదాయం పెరగనుంది. ఖమ్మం, విజయవాడ, భద్రాచలం, కొత్తగూడెం, సత్తుపల్లి ప్రాంతాలకు కనకగిరి అడవులు సమీపాన ఉండడంతో త్వరలోనే పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని భావిస్తున్నారు. ప్రకృతి, పర్యావరణ ప్రేమికులు కనకగిరి అడవుల బాట పట్టే అవకాశముందని చెబుతున్నారు. తద్వారా ఈ మార్గంలో ప్రైవేట్ రంగంలో హోటళ్లు, విడిది కేంద్రాలు ఏర్పాటైతే స్థానికులకు ఉపాధి మార్గాలు పెరుగుతాయి.

ఒకటి, రెండూ కాదు..

కనకగిరి కొండలపై కాకతీయుల హయాంలో నిర్మించిన వీరభద్రస్వామి ఆలయం, శివాలయాలను ఎకో టూరిజం కింద అభివృద్ధి చేయనున్నారు. అలాగే, కల్లూరు సమీపాన కాకతీయుల కాలంలో నిర్మించిన పల్లేర్ల బావి, పాత ఖిల్లాను అభివృద్ధి చేసి కనకగిరి కొండలపై లియోపర్డ్ వాచ్ టవర్‌ను సిద్ధం చేశారు. పలుచోట్ల వ్యూపాయింట్లు, సెల్ఫీ పాయింట్ల ద్వారా కనకగిరి కొండల అందాలను వీక్షించేలా చర్యలు తీసుకుంటారు. ఏడాది పొడవునా నీరు ఉండే పల్లేర్ల బావితో పాటు పల్లేర్ల వీరభద్రస్వామి ఆలయాన్ని కూడా అభివృద్ధి చేసేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. కనకగిరి హిల్స్‌పైకి సులువుగా వెళ్లేలా తిరుమల మాదిరి ఘాట్ రోడ్డు నిర్మించడంతో పాటు గిరిజనుల్లో శిక్షణ పొందిన డ్రైవర్లను ఎంపిక చేసి జంగిల్ సఫారీ వాహనాలు సమకూరుస్తారు. అలాగే, పులిగుండాల వాటర్ ఫాల్స్‌కు ట్రెక్కింగ్ చేస్తూ వెళ్లేలా గైడ్లను నియమిస్తారు.



వెదురు బొంగులతో నిర్మిస్తున్న కాటేజీలు

ప్రకృతి ప్రేమికులకు వరమే...

పులిగుండాల ప్రాజెక్టులో పర్యాటకుల కోసం ట్రెక్కింగ్, సఫారీ, బోటింగ్ అందుబాటులోకి తీసుకురావడమే కాక రాత్రి బస కోసం పర్యాటక శాఖ ద్వారా కాటేజీలు నిర్మిస్తారు. ఇక్కడ సోలార్ ప్లాంట్లతో విద్యుత్ సౌకర్యం కల్పించనుండగా ప్రకృతి ఒడిలో సేదదీరే అవకాశం కలగనుంది. అలాగే, పక్షులను వీక్షించేందుకు వాచ్ టవర్ నిర్మించగా.. పర్యాటకుల సౌకర్యార్థం రోడ్డు సౌకర్యం కూడా కల్పిస్తున్నారు.

పర్యాటకుల కోసం...

వ్యూ పాయింట్లు, జంగిల్ సఫారీ, విద్యార్థుల స్టడీ టూర్‌కు ఏర్పాట్లు చేస్తూనే వెదురు బొంగులతో గుడిసెల(హట్స్) నిర్మాణం చేపడుతున్నారు. ట్రెక్కింగ్, సాధారణ నడకకు ఏర్పాట్లతో పర్యాటకులను ఆకట్టుకోనుండడమే కాక ఐటీడీఏ ద్వారా స్త్రీ శక్తి క్యాంటీన్లను సైతం ఏర్పాటుచేసి పర్యాటకులకు భోజన వసతి కల్పిస్తారు. ఇదేసమయాన ఎవరూ ప్లాస్టిక్ వస్తువులు తీసుకురాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతారు. అవసరమైతే కొంత సొమ్ము డిపాజిట్ తీసుకుని గాజు బాటిళ్లు, వెదురు, ఇతర పర్యావరణహిత (ఎకో ఫ్రెండ్లీ) వస్తువులను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు.

అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నాం...

ప్రభుత్వ సూచనలతో జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాం. ఇందులో భాగంగా వెలుగుమట్ల అర్బన్ పార్క్, జమలాపురం ఎకో ఫ్రెండ్లీ పార్క్‌తో పాటు కనకగిరి సర్క్యూట్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈనెల 15న సర్క్యూట్‌ను ప్రాథమికంగా ప్రారంభించేలా ప్రణాళిక రూపొందించాం. ఎకో, టెంపుల్, అడ్వెంచర్, హిస్టారికల్, ఫారెస్ట్ టూరిజం కలగలిపి ఉన్న కనకగిరి సర్క్యూట్‌ను పర్యావరణ ప్రేమికులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, డీఎఫ్ఓ

తెలంగాణపై కేంద్రానిది | సవతితల్లి ప్రేమ



నిరసనలో పాల్గొన్న మంత్రి తుమ్మల, నాయకులు

- విభజన హామీల అమలులో నిర్లక్ష్యం
- నిరసన కార్యక్రమంలో మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు తప్ప ఇతర రాష్ట్రాలపై తీవ్ర వివక్షత చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. టీపీసీసీ పిలుపు మేరకు డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ సోమవారం ఖమ్మంలో ర్యాలీ నిర్వహించడంతో పాటు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అలాగే, కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బడ్జెట్‌లో తెలంగాణపై సవతితల్లి ప్రేమ చూపిన కేంద్రం కేవలం రాజకీయ ప్రయోజనాలకు పెద్దపీట వేసిందని ఆరోపించారు. తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు, విమానాశ్రయాలు, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీకి నిధులు కేటాయించలేదని, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీతో సహా కేంద్ర మంత్రులను కలిసినా పెడచెవిన పెట్టారన్నారు. పోలవరం మాదిరి తెలంగాణకు ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదని తెలిపారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడగా నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, నాయకులు, ప్రజాప్రతినిధులు దొబ్బల సౌజన్య, సాధు రమేష్‌రెడ్డి, ఎర్రం బాలగంగాధర తిలక్, నాగండ్ల దీపక్‌చౌదరి, రావర్తి శరత్, మహ్మద్ ఆశ్రిఫ్, రఫీ, షేక్ రషీద్, నారాయణరావు, బొజ్జడ్ల సతీష్, నరాల నరేష్, దిరిశాల చిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి: త్వరలో జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో విజయం సాధించేలా పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే దృష్టి సారించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దిశానిర్దేశం చేశారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో పాలేరు నియోజకవర్గ నాయకులతో మంత్రి సోమవారం సమావేశమయ్యారు. ఈనెల 15 తర్వాత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడే అవకాశమున్నందున కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించేలా శ్రమించాలన్నారు. రిజర్వేషన్లు, స్థానిక అంశాల ఆధారంగా టికెట్ల కేటాయింపు ఉంటుందని, ఎవరికి టికెట్ వచ్చినా గెలుపే లక్ష్యంగా అంతా కలిసికట్టుగా పనిచేయాలే తప్ప వ్యక్తిగత విబేధాలతో ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. పార్టీ కోసం కష్టించిన నేతలు, టికెట్ దక్కని వారికి మరో రూపంలో న్యాయం చేస్తామని మంత్రి తెలిపారు.

ఇళ్లస్థలాల మంజూరుకు చిత్తశుద్ధితో ఉన్నాం..

అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు ఇంటి స్థలం మంజూరు చేసేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచిలో సోమవారం నిర్వహించిన పాలేరు నియోజకవర్గ స్థాయి జర్నలిస్టుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల ఇళ్ల సమస్య చాన్నాళ్లుగా ఉందని, ఇందులో న్యాయ, సాంకేతికపరమైన చిక్కులను పక్కా ఆలోచనతో పరిష్కరిస్తామన్నారు. అలాగే, అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డుల సమస్యపై కసరత్తు జరుగుతున్నందున త్వరలో తీరుస్తామని మంత్రి తెలిపారు.

అది బీజేపీ బడ్జెట్ మాత్రమే...

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ బీజేపీ బడ్జెట్ మాత్రమేనని, ఆ పార్టీ రాజకీయ అవసరాలను తీర్చేలా కేటాయింపులు ఉన్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఖమ్మం గిరిప్రసాద్ భవనంలో సోమవారం జరిగిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ విధానాలతో పేదలు మరింత పేదలవుతుంటే సంపన్నులు ఇంకొంత సంపద పోగేసుకునే అవకాశం వస్తోందన్నారు. వేతన జీవులకు ఊరట అని ప్రకటించినా, సోమవారం నాటి నిర్మలా సీతారామన్ ప్రకటనతో అందరూ ఆలోచనలో పడ్డారని తెలిపారు. ఓ పక్క మత విశ్వాసాలను రెచ్చగొడుతూ మరోపక్క ప్రైవేటీకరణలో వేగం పెంచుతున్న బీజేపీ దేశంలో శాంతి, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రమాదకరంగా మారిందని పేర్కొన్నారు. కాగా, తెలంగాణలోని రేవంత్ సర్కార్ సైతం ప్రజల ఆలోచనలకనుగుణంగా పథకాలను అమలు చేయాల్సి ఉందని, ప్రభుత్వంపై ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. అతిత్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశమున్నందున మెరుగైన ఫలితాలు సాధించేలా పార్టీ నేతలు కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, నాయకులు కొండపర్తి గోవిందరావు, దండి సురేష్, మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

శ్రామికవర్గానికి వ్యతిరేకంగా కేంద్ర బడ్జెట్

- బీజేపీ ఎంపీలు, కేంద్రమంత్రులు రాజీనామా చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, పక్కన తమ్మినేని, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్లకు అనుకూలంగా, శ్రామిక, బడుగు, బలహీనవర్గాలకు వ్యతిరేకంగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌పై సోమవారం ఖమ్మంలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యాన నిరసన తెలిపి, కేంద్ర ప్రభుత్వం, మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ కోట్లాది మంది ఉపాధి కూలీల సంక్షేమాన్ని పట్టించుకోకపోగా, ఎరువుల రాయితీలో కోత విధించారన్నారు. తెలంగాణలో పాలమూరు–రంగారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టులకు జాతీయ హోదా, హైదరాబాద్ మెట్రో రెండో లైన్‌కు నిధులు కేటాయించకపోగా బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఊసెత్తనందున రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

గ్యారంటీల అమలుకు పూనుకోవాలి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయాన ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుచేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఎస్.వీరయ్య డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డీ.జహంగీర్ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలను ఇప్పుడు విస్మరించడం సరికాదన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ సంపూర్ణంగా పూర్తి చేయాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని ప్రతీ వ్యవసాయ కార్మిక కుటుంబానికి రూ.12 వేలు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం పథకాల అమలులో ఇలాగే వ్యవహరించి ఓటమిపాలైందని గుర్తు చేశారు. కాగా, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన కేటాయింపులు చేయకున్నా బీఆర్ఎస్, కాంగ్రెస్ మొక్కుబడిగా నిరసన తెలిపాయని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంతో రాజీ ధోరణి, అలసత్వం సరికాదని పేర్కొన్నారు. కాగా, సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యాక తొలిసారి ఖమ్మం వచ్చిన జాన్‌వెస్లీకి ఆ పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈకార్యక్రమాల్లో నాయకులు పోతినేని సుదర్శన్, మల్లు లక్ష్మి, నున్నా నాగేశ్వరరావు, అబ్బాస్, చెరుపల్లి సీతారాములు, ఎం.సాయిబాబు, మచ్చా వెంకటేశ్వర్లు, సాదుల శ్రీనివాస్, ఎం.సుధాకర్‌రెడ్డి, బందు సాయిలు, బీరెడ్డి సాంబశివ, జి.ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వెంట నడిస్తేనే ప్రయోజనం

- అటవీ కార్యాలయ శతాబ్ది వేడుకల్లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- హాజరైన పీసీసీఎఫ్ సువర్ణ, సీసీఎఫ్ భీమానాయక్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పీసీసీఎఫ్ సువర్ణ, అధికారులు

ఖమ్మంవన్‌టౌన్: ప్రకృతిని కాపాడుకుంటూ ముందుకు సాగితే అనేక ప్రయోజనాలు సొంతమవుతాయని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వెల్లడించారు. ఖమ్మంలోని అటవీశాఖ కార్యాలయ శతాబ్ది వేడుకలు సోమవారం నిర్వహించగా కలెక్టర్‌తో పాటు పీసీసీఎఫ్ సువర్ణ, సీసీఎఫ్ భీమానాయక్, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ పాల్గొన్నారు. తొలుత విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ అధికారులకు నివాళులర్పించాక కలెక్టర్ మాట్లాడుతూ అడవులు లేనిది అభివృద్ధి ఉండదని తెలిపారు. ప్రతీ ఇంచు అటవీ భూమిని కాపాడడానికి అటవీశాఖ ఉద్యోగులు చేస్తున్న కృషికి అందరూ సహకరించాలని సూచించారు. కృత్రిమ భవనాలు, వస్తువులతో సంతోషంగా ఉండొచ్చేమో కానీ భావి తరాలకు అన్యాయం చేసిన వారమవుతామని చెప్పారు. ఈనేపథ్యాన అడవుల అవసరంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో వైల్డ్‌లైఫ్, ఎకో టూరిజం అభివృద్ధిలో పాలుపంచుతామని కలెక్టర్ తెలిపారు. కాగా, కలెక్టర్, సీపీ క్యాంపు కార్యాలయాల నిర్మాణం జరిగి వందేళ్లు దాటినా ఇప్పటికీ చెక్కు చెదరలేదని.. ఇక్కడ పనిచేయడాన్ని అదృష్టంగా భావించాలని చెప్పారు. అనంతరం అటవీశాఖ రిటైర్డ్ ఉద్యోగులు తమ అనుభవాలను వివరించగా వెలుగుమట్ల అర్బన్ పార్క్‌పై రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సమావేశంలో అటవీశాఖ విశ్రాంత అధికారులు, ఎఫ్‌డీఓలు, ఎఫ్ఆర్ఓలు పాల్గొన్నారు.

ఆటల్లోనూ మెరికలే..

జిల్లా పోలీసులకు 42పతకాలు



పతకాలు సాధించిన వారితో సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: రాష్ట్రస్థాయి పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించగా జిల్లా పోలీసులు ప్రతిభ కనబరిచారు. టోర్నీలో కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, షటిల్, బ్యాడ్మింటన్, జూడో, వెయిట్ లిఫ్టిగ్, పవర్ లిఫ్టింగ్, షటిల్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్ తదితర విభాగాల్లో జిల్లా ఉద్యోగులు 42పతకాలు సాధించారు. ఈసందర్భంగా పోలీసు క్రీడాకారులను సీపీ సునీల్‌దత్ సోమవారం అభినందించి మాట్లాడారు. సవాళ్లు, ఒత్తిడితో కూడిన ఉద్యోగం చేస్తూనే క్రీడల్లో పతకాలు సాధించడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయి స్పోర్ట్స్ మీట్‌లోనూ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీలు కుమారస్వామి, విజయబాబు, ఏఆర్ ఏసీపీలు నర్సయ్య, సుశీల్‌సింగ్ పాల్గొన్నారు.



క్లుప్తంగా

53 మంది బాలలకు విముక్తి

ముగిసిన 'ఆపరేషన్ స్మైల్–11'

ఖమ్మంక్రైం: బాలకార్మికులకు విముక్తి కల్పించేందుకు వివిధ శాఖల భాగస్వామ్యంతో చేపట్టిన ఆపరేషన్ స్మైల్–11 ముగిసిందని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1నుంచి 31 వరకు నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ కమిషనరేట్ పరిధిలో 53మంది బాలబాలికలకు విముక్తి కల్పించామని చెప్పారు. ఇందులో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 16మంది ఉన్నారని తెలిపారు. మొత్తం బాలబాలికల్లో 44మందిని తల్లిదండ్రులకు అప్పగించగా, మరో 9మందిని రెస్క్యూ హోమ్‌కు తరలించినట్లు వెల్లడించారు. కాగా, బాలల హక్కులను కాపాడడం, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు అందరూ పాటుపడాలని సీపీ కోరారు. ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిసినా, ఎక్కడైనా తప్పిపోయిన బాలల సమాచారం తెలిసినా చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ పద్మజ

ఖమ్మంసహకారనగర్: ఇంటర్‌మీడియట్ పరీక్షలు పకడ్బందీగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఏ.పద్మజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆమె సంబంధిత శాఖల అధికారులతో సమావేశమయ్యారు. పరీక్షలు మార్చి 5నుంచి 25 తేదీ వరకు జరగనుండగా 36,660 మంది విద్యార్థుల కోసం 72 పరీక్ష కేంద్రాలను గుర్తించామని తెలిపారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని సూచించారు. అలాగే, కేంద్రాల్లో తాగునీరు, అవసరమైన వసతులు కల్పించడమే కాక ప్రతీ కేంద్రం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కనీస మందులతో పారా మెడికల్ సిబ్బందిని నియమించాలని తెలిపారు. పరీక్ష సమయానికి ఆర్టీసీ బస్సులు నడిపించాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.కళావతిబాయి, వివిధ శాఖల ఉద్యోగులు ఆర్.నారాయణ, దినేష్‌కుమార్, విజయలక్ష్మి, వెంకటరామయ్య, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం కోసం తమ వంతుగా....

గ్రంథాలయ నిర్వహణకు వధూవరుల విరాళం



విరాళం అందిస్తున్న నూతన జంట

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడిలో ఇటుకల విశ్వనాధాచారి గ్రామ గ్రంథాలయ నిర్వహణకు గ్రామస్తులు చేయూతనిస్తున్నారు. గ్రామంలో ఎవరి ఇంట్లో వివాహం జరిగినా నూతన జంట తొలుత గ్రంథాలయాన్ని సందర్శించి తమ వంతు విరాళం అందించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా సోమవారం దంతాల నవీన్ – మంజుల దంపతులు పెళ్లిబట్టలతోనే లైబ్రరీకి వచ్చి రూ.2,116 అందజేశారు. ఇప్పటి వరకు సుమారు 60మంది ఇలా విరాళాలు ఇచ్చారని, ఈ నగదును నిర్వహణ, పుస్తకాల కొనుగోలుకు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు.

వరి పైరును పరిశీలించిన శాస్త్రవేత్తలు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంలో ఎన్నెస్పీ ఆయకట్టు కింద రైతులు సాగు చేస్తున్న వరి పొలాలను వైరా కేవీకే శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన వరి ఏపుగా పెరగకుండా ఆకు చుట్టుకుని గిడసబారి మొక్కలు ఎండి పోతున్నట్లు గుర్తించారు. ఈమేరకు కేవీకే కోఆర్డినేటర్ రవికుమార్ రైతులకు పలు సూచనలు చేశారు. కలుపు మందులను పరిమితి మేరకే పిచికారీ చేయాలని, నత్రజనితో పాటు పొటాష్ మందులు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త వి.చైతన్య, విస్తరణ శాస్త్రవేత్త పీఎస్ఎం.ఫణిశ్రీ, రైతులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,950	1,850
పెసలు	6,500	6,500
మిర్చి	14,200	7,000
మిర్చి తాలు	7,400	5,900
ఏసీ మిర్చి	12,600	6,500
పత్తి	7,150	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,487

మిర్చి రైతుకు ధరాఘాతం

విక్రయాలు పెరుగుతున్న వేళ తగ్గుతున్న ధర

- గత సీజన్‌తో పోలిస్తే రూ.10 వేల మేర పతనం
- రూ.13 వేలకు పడిపోయిన మోడల్ ధర



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

ఖమ్మంవ్యవసాయం: మిర్చి ధర రైతులను ఆవేదనకు గురిచేస్తోంది. నానాటికీ విక్రయాలు పెరుగుతుండగా ధర పతనమవుతుండడం గమనార్హం. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం 60 వేల బస్తాల మిర్చిని తీసుకురాగా సీజన్‌లో ఇదే అత్యధికమని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. అయితే, ధరలో మాత్రం పురోగతి లేకపోవంతో రైతులు ఎటూ పాలుపోని పరిస్థితి ఎదుర్కొన్నారు. గత సీజన్‌తో పోలిస్తే ఏకంగా రూ.10 వేలకు పైగా తేడా ఉండడం గమనార్హం. గత ఏడాది సీజన్‌లో క్వింటా మిర్చికి రూ.23వేల వరకు పలికిన ధర ప్రస్తుతం రూ.13 వేలు మించడం లేదు.

సీజన్ జోరు.. ధర బేజారు

ప్రస్తుతం ఖమ్మం మార్కెట్‌లో నానాటికీ మిర్చి విక్రయాలు పెరుగుతున్నాయి. విదేశీ ఎగుమతులకు అనువైన తేజ రకాన్ని ఇక్కడ ఎక్కువగా సాగు చేస్తుండగా ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు సూర్యాపేట, నల్లగొండ, వరంగల్ జిల్లాల నుంచే కాక ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు జిల్లాల రైతులు పంట విక్రయానికి ఇక్కడకు వస్తారు. మార్కెట్‌కు నిత్యం 40వేల నుంచి 60 వేల బస్తాల వరకు విక్రయానికి తీసుకొస్తున్నారు. గత ఏడాది నవంబర్ వరకు రూ.18 వేలు పలికిన ధర డిసెంబర్ నాటికి రూ.16 వేలకు, జనవరి ఆరంభంలో రూ.15,500కు పడిపోయింది. గత వారం రోజులుగా జెండాపాట రూ.14 వేలుగా నమోదవుతుండడంతో సోమవారం అదే పరిస్థితి ఎదురైంది. సీపీఐ అనుబంధ రైతు సంఘం నాయకుల ఆందోళనతో రూ.200 పెంచినా ఎక్కువ శాతం మిర్చిని రూ.13వేలతోనే కొనుగోలు చేశారు. ఇక ఏసీ మిర్చి ధర రూ.12 వేలకు పడిపోవడం గమనార్హం. క్వింటాకు రూ.25 వేల వరకు ధర వస్తుందనే ఆశతో రూ.19వేలుగా ఉన్న సమయాన కొనుగోలు చేసి కోల్డ్ స్టోరేజీల్లో పెట్టిన వ్యాపారులకు ఇప్పుడు కోలుకోలేని దెబ్బ తగిలింది.

కొద్దిరోజులుగా ఖమ్మం మార్కెట్‌లో మిర్చి జెండా పాట ధర (క్వింటాకు)

తేదీ	ధర (రూ.ల్లో)
డిసెంబర్ 18	16,200
డిసెంబర్ 31	15,511
జనవరి 2	14,900
జనవరి 8	15,800
జనవరి 16	14,000
జనవరి 27	14,800
జనవరి 31	14,000
ఫిబ్రవరి 3	14,200

ఎగుమతులు మందగించడంతోనే...

మిర్చి ధర పతనానికి విదేశీ ఎగుమతులు మందగించడమే ప్రధాన కారణంగా చెబుతున్నారు. తేజా రకం మిర్చి ఇక్కడ నుంచి చైనాతో పాటు బంగ్లాదేశ్, మలేసియా, సింగపూర్ వంటి దేశాలకు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం ఎక్కడికీ ఆర్డర్లు లేకపోవడం.. చైనాలోనూ పంట సాగవుతుండడం, ఎగుమతిదారులు పోటీ పడి ధర తగ్గిస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో మిర్చి ఆయిల్ మిల్లులు ఏర్పాటవడంతో కొందరు నేరుగా ఆయిల్ ఎగుమతికి ఒప్పందం చేసుకుంటుండడం మిర్చి ధరపై ప్రభావం పడడానికి మరో కారణంగా చెబుతున్నారు.

రూ.12,200 ధర పెట్టారు..



ఖమ్మం మార్కెట్‌లో మంచి ధర వస్తుందని 55 బస్తాల మిర్చి తీసుకొచ్చా. రూ.15 వేల వరకు ధర వస్తుందని అనుకుంటే మొదట రూ.13,400గా కమీషన్‌దారు చెప్పారు. ఆ తర్వాత రూ.12,200గా నిర్ణయించినా చేసేదేం లేదక అమ్ముకున్నా.

– నూనావత్ దస్రూ, చర్లతండా, నల్లగొండ జిల్లా

పెట్టుబడులు పెరిగాయి..



మిర్చి సాగుకు పెట్టుబడులు పెరిగాయి. ధర చూస్తే బాగా తగ్గింది. గత ఏడాది తాలుకు ఉన్న ధరను ప్రస్తుతం ఎర్ర మిర్చికి పెడుతున్నారు. గత ఏడాది రూ.22 వేలకు అమ్మాను. ఇప్పుడు 33 బస్తాల మిర్చికి రూ.13,500 ధర చెల్లించారు.

– మొగిలిచర్ల రమేష్, నర్సింహులగూడెం, సూర్యాపేట జిల్లా

'మిర్చి రైతులను దెబ్బతీస్తున్న సిండికేట్'

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మార్కెట్‌లో మిర్చికి సరైన ధర నిర్ణయించకుండా సిండికేట్‌గా ఏర్పడిన కొందరు రైతులను దెబ్బతీస్తున్నారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆరోపించారు. సీపీఐ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యానసోమవారం ఖమ్మం మార్కెట్‌లో మిర్చి జెండాపాటను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాగం మాట్లాడుతూ మొదట క్వింటా మిర్చికి రూ.13 వేల ధర నిర్ణయించగా, తమ ఆందోళనతో రూ.14,200కు పెంచారని తెలిపారు. తద్వారా వ్యాపారులు సిండికేట్ కారణంగానే ధర తగ్గుతున్నట్లు రుజువైందన్నారు. వ్యాపారులకు మార్కెట్ ఉద్యోగులు తోడవుతుండడంతో రైతులకు నష్టజరుగుతోందని తెలిపారు. అనంతరం మార్కెట్ చైర్మన్ హన్మంతరావును కలిసి సమస్యలను వివరించగా ఆయన స్పందిస్తూ త్వరలోనే రైతు సంఘం నాయకులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. నాయకులు దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్.కే.జానీమియా, దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, పోటు కళావతి, మిడికంటి వెంకటరెడ్డి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

'గ్రీవెన్స్ డే'లో అదనపు కలెక్టర్ శ్రీజ



గ్రీవెన్స్ డేలో వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంసహకారనగర్: ప్రజావాణి(గ్రీవెన్స్ డే)లో అందే అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆమె డీఆర్వో ఏ.పద్మజ, డీఆర్డీవో సన్యాసయ్యతో కలిసి ఆమె దరఖాస్తులు, వినతులు స్వీకరించారు. అధికారులతో సమావేశమైన అదనపు కలెక్టర్ పరిష్కారంపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఏఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేలా కార్యాచరణ రూపొందించాలని అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. సతుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీల అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశమైన ఆమె ఆస్తి పన్నుల వసూళ్లు, అభివృద్ధి పనుల్లో పురోగతి, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణపై సమీక్షించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రాధాన్యత ఇస్తూనే ఆస్తి పన్నులు వంద శాతం వసూలు చేయాలని తెలిపారు. కమిషనర్లు వేణు, సంపత్‌కుమార్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి

ఖమ్మంసహకారనగర్/ఖమ్మం వన్‌టౌన్: స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేలా అధికారులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి ఎం.అశోక్ కుమార్ సూచించారు. హైదరాబాద్ నుంచి సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లపై సమీక్షించగా జిల్లా నుంచి అదనపు కలెక్టర్ పి.శ్రీజ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీపీఓ ఆశాలత, డిప్యూటీ సీఈఓ కె.నాగపద్మజ, డీఎల్‌పీఓ రాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో ఓటర్ల జాబితా మ్యాపింగ్, ఎంపీటీసీ స్థానాల ఖరారు, పోలింగ్ కేంద్రాల గుర్తింపుతో పాటు బ్యాలెట్ బాక్సులు సమకూర్చుకుని బ్యాలెట్ పేపర్ల ముద్రణపై దృష్టి సారించాలని సూచించారు. ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా ఎన్నికలు నిర్వహించేలా సిద్ధంగా ఉండాలని, ఇందుకోసం ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. జిల్లా నుంచి వీసీకి హాజరైన అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈఓలు అధికారులతో కలిసి ఖమ్మం డీపీఆర్సీ భవనంలో బ్యాలెట్ పేపర్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.



బ్యాలెట్ పత్రాల తనిఖీపై సూచనలు చేస్తున్న జెడ్పీ సీఈఓ దీక్షారైనా

తాగునీటికి ఇబ్బందులు రావొద్దు



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న సీఈ శ్రీనివాస్

వైరా: రానున్న వేసవిలో మిషన్ భగీరథ పథకం ద్వారా నీరు సరఫరా అయ్యే గ్రామాల్లో తాగునీటికి ఎద్దడి ఏర్పడకుండా అధికారులు పర్యవేక్షించాలని చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ ఆదేశించారు. వైరాలోని మిషన్ భగీరథ పథకం ఇన్ టేక్‌వెల్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. వేసవి దృష్ట్యా ముందుగానే లీకేజీలను అరికట్టడంతో పాటు అవసరమైన మరమ్మతులు పూర్తిచేయాలని తెలిపారు. చివరి గ్రామానికి సైతం సాఫీగా నీరు సరఫరా అయ్యేలా చూడాలని చెప్పారు. ఎస్ఈ సదాశివరావు, ఈఈ వాణిశ్రీ, డీఈ వెంకటేశ్వరరావు, ఏఈలు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వరిగడ్డి దగ్ధం

నేలకొండపల్లి: ఓ బాలుడు తెలియక అగ్గిపుల్ల గీసి వేయడంతో వరి గడ్డివామి కాలిపోయింది. మండలంలోని మంగాపురంతండాకు చెందిన రైతు భూక్యా రవి వరి గడ్డి దిండ్ల వద్ద ఓ బాలుడు తెలిసీతెలియక అగ్గిపుల్ల అంటించి వేయడంతో దాదాపు 300 గడ్డిదిండ్లు కాలిపోయాయి. గడ్డివామి ఇళ్ల మధ్య ఉండడంతో ఆందోళనకు గురైన స్థానికులు పరిసర ప్రాంతాల్లో నీళ్లు చల్లారు. అలాగే, అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వాహనంతో చేరుకుని మంటలను అదుపు చేశారు. కాగా, ప్రమాదానికి కారణమైన బాలుడి కుటుంబంతో పలువురు గొడవకు దిగగా మిగతా గ్రామస్తులు జోక్యం చేసుకుని శాంతింపచేశారు.

'టెలీ మానస్'తో ఊరట..

- టోల్ ఫ్రీ నంబర్ 14416 ద్వారా కౌన్సెలింగ్ సాయం
- విద్యార్థుల్లో పరీక్షల భయం పోగొట్టేందుకు ప్రభుత్వ కార్యక్రమం



పినపాక కళాశాలలో టెలీమానస్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దుర్గాభవాని(ఫైల్)

కరకగూడెం: ఇంటర్మీడియట్ విద్యార్థులకు వార్షిక పరీక్షల సమయం దగ్గర పడుతోంది. దీంతో అధ్యాపకులు సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో చాలా మంది విద్యార్థుల్లో పరీక్షలంటే భయం, ఆందోళన నెలకొన్నాయి. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తామో? లేదోనని, తక్కువ మార్కులు వస్తాయేమోనని భయపడుతున్నారు. కొన్నిసార్లు ఆశించిన ఫలితాలు రానప్పుడు కొందరు విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలను చూస్తుంటాం. ఇది చాలా బాధాకరమైన విషయం. ఈ సమస్యను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల్లో పరీక్షల భయం పోగొట్టేందుకు, వారి మానసిక స్థితిని మెరుగుపరిచేందుకు 'టెలీమానస్' టోల్ ఫ్రీ నంబర్ 14416ను అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రారంభించిన నేషనల్ టెలీమెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియాలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు.

మానసిక ఆరోగ్య సహాయం

టెలీమానస్ అనేది టెలీమెంటల్ హెల్త్ అసిస్టెన్స్, నేషనల్ టెలిమెంటల్ హెల్త్ ప్రోగ్రాం ఆఫ్ ఇండియా కార్యక్రమాల్లో ముఖ్యమైనది. మానసిక సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు సహాయం చేసేందుకు ఉద్దేశించింది. ముఖ్యంగా పరీక్షల సమయంలో ఒత్తిడికి గురయ్యే విద్యార్థులకు ఉపయోగకరమైనది. విద్యార్థులు లేదా తల్లిదండ్రులు 14416కు ఫోన్ చేసి తగిన సాయం పొందవచ్చు. ఈ నంబర్ 24/7 అందుబాటులో ఉంటుంది. శిక్షణ పొందిన మానసిక ఆరోగ్య నిపుణులు సమస్యలను విని తగిన సలహాలు, సూచనలు చేస్తారు. ఈ క్రమంలో కళాశాలల్లో పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలు ఈ సేవల పట్ల అవగాహన కల్పిస్తున్నాయి.

టెలీమానస్ లక్ష్యాలు

- ✔ విద్యార్థుల్లో పరీక్షల భయం, ఆందోళనను తగ్గించడం
- ✔ మానసిక సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు ఉచిత కౌన్సిలింగ్, సహాయం అందించడం
- ✔ విద్యార్థులకు మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యతను తెలియజేయడం
- ✔ ఆత్మహత్యల నివారణకు కృషి చేయడం

జీవితం పరీక్షల కంటే విలువైనది

పరీక్షలు జీవితంలో ఒక భాగం మాత్రమేననే విషయాన్ని విద్యార్థులు గుర్తించుకోవాలి. వాటి ఫలితాలు భవిష్యత్‌ను పూర్తిగా నిర్ణయించలేవు. మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యం. ఒత్తిడికి గురైనప్పుడు ఇతరుల సహాయం తీసుకునేందుకు వెనకాడొద్దు. టెలీమానస్ సేవలు మీకు అందుబాటులో ఉన్నాయి. జీవితం పరీక్షల కంటే విలువైంది.

–దుర్గాభవాని, పినపాక ప్రభుత్వ వైద్యాధికారి

వేతనాలు చెల్లిస్తేనే విధుల్లోకి...



నిరసన తెలుపుతున్న కార్మికులు

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు గత మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో కుటుంబ పోషణకు ఇబ్బంది ఎదురవుతోందని వాపోతున్నారు. ఈనేపథ్యాన వేతనాలు చెల్లించాలని కోరుతూ సోమవారం ఆస్పత్రికి వచ్చినా పని చేయకుండా నిరసన తెలిపారు. వేతనాలు ఇచ్చే వరకు ఇలాగే నిరసన తెలుపుతామని వారు వెల్లడించారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ముగిసిన భక్తరామదాసు జయంతి ఉత్సవాలు



రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ నాగేశ్వరరావుకు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

నేలకొండపల్లి: మండల కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న భక్తరామదాసు జయంతి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. వివిధ ప్రాంతాల కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వగా, భాషా సాంస్కృతిక శాఖ, పాలనా యంత్రాంగం, భద్రాచలం దేవస్థానం, శ్రీ భక్తరామదాసు విద్వత్ కళాపీఠం ఆధ్వర్యాన ఉత్సవాలు కొనసాగాయి. అయితే, పెద్దగా ప్రచారం చేయకపోవడంతో ఈ ఏడాది ఎక్కువ హాజరుకాలేదని స్థానికులు వాపోయారు. కాగా, సోమవారం సాయంత్రం జరిగిన ముగింపు సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొనగా తొలుత రామదాసు మందిరంలో పూజలు చేశారు. విద్వత్ కళాపీఠం ప్రతినిధులు రాధాకృష్ణమూర్తి, పెండ్యాల గోపాలకృష్ణమూర్తితో పాటు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వంగవీటి నాగేశ్వరరావు, మామిడి వెంకన్న, రాయపూడి నవీన్, బొందయ్య, వాసవి, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, మామిడి సుభద్ర, బోయిన వేణు, సూరేపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

25లక్షల మె.టన్నుల సన్న బియ్యం సేకరణ

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు

నేలకొండపల్లి: రాష్ట్రంలో ఇప్పటి వరకు 25 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని సేకరించినట్లు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. నేలకొండపల్లిలోని వ్యవసాయ మార్కెట్ గోదాంలో నిల్వ చేసిన బియ్యాన్ని సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. త్వరలోనే రేషన్ కార్డులకు సన్నబియ్యం ఇవ్వనుండగా మిల్లర్ల ద్వారా సీఎంఆర్ సేకరిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 5లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాంలు ఉండగా, మరో మూడు లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాంలు నిర్మించనున్నట్లు తెలిపారు. రైతులకు ఉపయోగపడేలా ధాన్యం ఎక్కువగా పండించే ప్రాంతాల్లో వీటిని నిర్మిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

వివాహితతో అసభ్య ప్రవర్తన

రఘునాథపాలెం: మండలంలోని శివాయిగూడెంలో ఓ వివాహితతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. చింతకాని మండలం కోమట్లగూడెంకు చెందిన కొందరు శివాయిగూడెంలో పెళ్లి సంబంధం మాట్లాడేందుకు వచ్చారు. అందులోని ఓ వివాహితతో నాగేశ్వరరావు అనే వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాలురపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉద్యోగిపై పోక్సో కేసు

కారేపల్లి: మండలంలోని రేలకాయలపల్లి బాలుర ఆశ్రమ గురుకుల పాఠశాల విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడిన డిప్యూటీ వార్డెన్ బి.వెంకటేశ్వర్లుపై సోమవారం పోక్సో కేసు నమోదైంది. డిప్యూటీ వార్డెన్ కొద్దినెలలుగా విద్యార్థులను లైంగికంగా వేధిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో విచారించిన అధికారులు గతనెల 30న ఆయనను సస్పెండ్ చేసిన విషయం విదితమే. అయితే, సస్పెన్షన్ ఉత్తర్వులు తీసుకోకపోగా హెచ్‌ఎంపై దాడి చేసిన డిప్యూటీ వార్డెన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇదిలా ఉండగా తాజాగా ఓ బాలుడి తండ్రి పిర్యాదు చేయడంతో డిప్యూటీ వెంకటేశ్వర్లుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.రాజారాం తెలిపారు.

ఎనిమిది ఇసుక ట్రాక్టర్లు సీజ్

ముదిగొండ: మండలంలోని పెద్దమండవ, గంధసిరిలో మున్నేటి నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను సోమవారం సీజ్ చేసినట్లుసీఐ మురళి తెలిపారు. అక్రమంగా మున్నేరు నుంచి ఖమ్మంకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను వనంవారి కిష్టాపురం, న్యూలక్ష్మీపురం గ్రామాల వద్ద సీజ్ చేసి బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

- **కల్లూరు:** మండలంలోని బత్తుపల్లి నుంచి కల్లూరుకు అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్నట్లు టిప్పర్‌ను సోమవారం పోలీసులు గుర్తించారు. ఈమేరకు వాహనాన్ని మైనింగ్ శాఖకు అప్పగించినట్లు తెలిపారు.



WALK-IN-INTERVIEW

Invites Experienced Teacher to train the next Generation Students with latest Methodology in CBSE Orientation with commitment and Dedication.

ENGLISH : PRIMARY & HIGH SCHOOL

Qly.: PG with B.Ed, or 4-5 years experience in same subject

Please visit the campus in all working days, give the Resume and Demo inbetween 9 am and 5 pm.

Email : winfieldschool.kmm@gmail.com

WINFIELD CBSE SCHOOL

EMPOWERING MINDS | THE SMART SCHOOL

Mamatha Hospital Road, KHAMMAM.

Cell : 84988 88859, 70957 20022, 94920 05544

Sri ShivaSai Ads : 9052040909

సాక్షి క్లాసిఫైడ్స్



WANTED

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 25–30 వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95027 12418, 81218 18692 [M-1268551]

■ రిపోర్టర్స్ కావలెను. తెలుగు జాతీయ దినపత్రిక ప్రభాత దర్శిని కొరకు రిపోర్టర్స్ కావలెను. సంప్ర : బయోడేటాతో. Ph: 9493272754 [HA-15131]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన కొంతే! స్పందన కొండంత!!

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	9010299957
	9705444182
కొత్తగూడెం	9010223783
పాల్వంచ	9705444183
భద్రాచలం	9951602914
మణుగూరు	9705944416
సత్తుపల్లి	9652868642
మధిర	9949927792

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి

కేవలం రూ. 500/– మాత్రమే

(GST 5% అదనం)



ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న వాసు

వలంటీర్ల కోసం సమిధనవుతా..

- కూటమి ప్రభుత్వం వారిని విధుల్లోకి తీసుకోకుండా వేధింపులు
- సర్కారు తీరును నిరసిస్తూ యువకుడి ఆత్మహత్యాయత్నం

సాక్షిప్రతినిధి, విజయవాడ: 'కష్టాల్లో ఉన్న వలంటీర్ వ్యవస్థను కాపాడుకుందాం.. కరోనా సమయంలో వారు చేసిన సేవలను గుర్తిద్దాం. మనలోని మానవత్వాన్ని చాటుకుందాం' అంటూ ఓ యువకుడు బ్యానర్‌ను ప్రదర్శిస్తూ విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనం దగ్గర సోమవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. వలంటీర్లపై టీడీపీ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత ధోరణిని నిరసిస్తూ ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన నక్కా వాసు ఒంటిపై పెట్రోల్ పోసుకుని లైటర్‌తో నిప్పు అంటించుకుంటుండగా.. అక్కడే విధుల్లో ఉన్న సూర్యారావుపేట సీఐ అబ్దుల్ ఆలీషేక్ అడ్డుకున్నారు. అనంతరం సూర్యారావుపేట స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా విధుల్లోకి తీసుకోవాలని వలంటీర్లు చేస్తున్న ఆందోళన తనను కలిచి వేసిందన్నాడు. కరోనా సమయంలో సొంత వాళ్లే దగ్గరకు రాని దుర్భర పరిస్థితుల్లో వలంటీర్లు ప్రజలకు మర్చిపోలేని సేవలందించారని గుర్తుచేశాడు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు నేడు పింఛన్ కోసం పడరాని పాట్లు పడుతున్నారని, వలంటీర్లు ఉన్న రోజుల్లో హాయిగా ఇళ్ల వద్దే పింఛన్‌లు తీసుకున్నారని చెప్పారు. అప్పటి నుంచే వలంటీర్ వ్యవస్థకు అభిమానిగా మారానని, అంతటి సేవ చేసిన వలంటీర్లను ప్రస్తుత ప్రభుత్వం విధుల్లోకి తీసుకోకుండా వేధిస్తుండటంపై మనస్తాపానికి లోనై ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించినట్టు చెప్పాడు. వాసు కొన్నేళ్లుగా తండ్రితో కలిసి ఉండవల్లి సమీపంలోని పోలకంపాడులో ఉంటున్నాడు. కుంచనపల్లిలో నాటు కోళ్ల ఫాంను నడుపుతూ విజయవాడ, గుంటూరు, మంగళగిరి ప్రాంతాల్లోని చికెన్ షాపులకు నాటు కోళ్లను సరఫరా చేస్తుంటాడు. వాసు తండ్రి ఫైర్ స్టేషన్‌లో పని చేస్తుంటాడు. వాసుకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదు. కేవలం వలంటీర్ వ్యవస్థ రావాలని బలంగా కోరుకుంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

కూటమి కాలకేయుల సాక్షిగా..

ప్రజాస్వామ్యం ఖూనీ!

ఏపీలో మున్సిపల్ ఉప ఎన్నికల్లో అధికార మదంతో అరాచక పర్వం

సాక్షి ప్రతినిధి, తిరుపతి, సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: ఆదిమ తెగల్లోనూ కానరాని అకృత్యాలు టీడీపీ కూటమి సర్కారు పాలనలో ఆవిష్కృతమయ్యాయి! పట్టపగలు.. తిరుపతి నడి రోడ్డుపై పోలీసులు, జనం సాక్షిగా ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. తాలిబన్లు.. ఐసిస్.. హమాస్ ఉగ్రమూకలను తలదన్నే రీతిలో రాష్ట్రవ్యాప్తంగా మునిసిపల్ ఉప ఎన్నికల్లో పచ్చ ముఠాలు దాడులకు తెగబడి విధ్వంసం, భయోత్పాతం సృష్టించాయి! పలు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో చైర్మన్‌లు, డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్మన్ పదవులకు సోమవారం జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ నేతలు అరాచకాలకు తెగబడ్డారు. అసలు ఒక్క సీటు కూడా గెలవని చోట్ల.. తమకు ఏమాత్రం సంఖ్యా బలం లేని చోట్ల భయపెట్టి నెగ్గేందుకు కూటమి పార్టీలు కుతంత్రాలకు దిగాయి. పోలీసులతోపాటు ఆర్డీవో.. కలెక్టర్ దాకా ప్రభుత్వ వ్యవస్థలన్నింటినీ వాడుకుంటూ అధికార దుర్వినియోగానికి బరి తెగించాయి. బల ప్రయోగం, అక్రమాలు, అరాచకాలు, ప్రలోభాలతో ప్రజాస్వామ్య వ్యవస్థకే కళంకం తెచ్చేలా వ్యవహరించాయి. మునిసిపల్ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా పార్టీ గుర్తులతో జరిగాయి. అలాంటిది.. ఒక పార్టీ గుర్తుపై నెగ్గిన వారిని భయపెట్టి, ప్రలోభాలకు గురి చేసి ఇంత దారుణంగా ఫిరాయింపులకు ప్రోత్సహిస్తుంటే.. అసలు ఇక ఎన్నికలు ఎందుకు? పార్టీ గుర్తులు ఎందుకు? అని ప్రజలు తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి డిప్యూటీ మేయర్ ఉప ఎన్నికలో నెగ్గేందుకు కూటమి పార్టీల గూండాలు అరాచకం సృష్టించారు. ఉప ఎన్నికలో పాల్గొనేందుకు వాహనంలో వెళ్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల బస్సు ఆపి రాడ్లతో అద్దాలు పగలగొట్టి లోపలకు చొరబడి దాడులకు తెగబడ్డారు. బస్సులో ఉన్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లపై దాడిచేసి చొక్కా పట్టుకుని ఈడ్చుకెళ్లారు. మహిళా కార్పొరేటర్ల ఆర్తనాదాలు ఖాకీల చెవికెక్క లేదు. కార్పొరేటర్లను బలవంతంగా లాక్కెళుతున్న కూటమి గూండాల వాహనాలకు పోలీసులు దగ్గరుండి దారిచ్చి సాగనంపడం నివ్వెరపరుస్తోంది. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు పోలీసుల సాక్షిగా కూటమి గూండాలు చిత్తూరు, తిరుపతిలో సృష్టించిన అరాచకం ఇదీ!!

మూడు నగర కార్పొరేషన్లు, ఏడు మున్సిపాలిటీల్లో ఖాళీ అయిన డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు సోమవారం ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేయగా టీడీపీ నేతల దౌర్జన్యాలు, దాడులు, బెదిరింపులతో సగం చోట్ల ఐదు చోట్ల ఎన్నికలు జరగకుండా వాయిదా పడటం గమనార్హం.



వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల బస్సు అద్దాలను పగలగొడుతున్న కూటమి గూండా శంకర్‌యాదవ్



తిరుపతిలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను కిడ్నాప్ చేసి కారులో తీసుకెళుతున్న కూటమి గూండాలు

అర్ధరాత్రి నుంచి అరాచకం..

మూడేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుపతి కార్పొరేషన్‌లో మొత్తం 49 డివిజన్లకు గానూ 48 చోట్ల వైఎస్సార్‌సీపీ గెలుపొందింది. వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయరెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేయడంతో తిరుపతి డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ పదవులకు రాజీనామా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డిప్యూటీ మేయర్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడింది. కూటమికి ఒకే ఒక్క కార్పొరేటరే ఉన్నా అధికార బలంతో దాన్ని దక్కించుకునేందుకు కుట్రలకు తెర తీశారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ సెనెట్ హాలులో సోమవారం డిప్యూటీ మేయర్ ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. ఉప ఎన్నికలో ఎలాగైనా గెలవాలనే కుయుక్తులతో కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను కిడ్నాప్ చేసేందుకు సిద్ధమయ్యారు. .

బస్సుని అడ్డుకుని.. అద్దాలు ధ్వంసం చేసి

డిప్యూటీ మేయర్ ఉప ఎన్నిక కోసం సోమవారం ఉదయం 11 గంటలకు కార్పొరేటర్లంతా భూమన నివాసం నుంచి ప్రత్యేక బస్సులో ఎస్వీ యూనివర్సిటీలోని సెనెట్ హాలు వద్దకు బయలు దేరారు. దాదాపు 25 మంది కార్పొరేటర్లు, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం అందులో ఉండగా వర్సిటీ సమీపంలో వారి బస్సును కూటమి గూండాలు అడ్డుకున్నారు. సుమారు 500 మంది ఒకేసారి బస్సుపైకి దూసుకొచ్చి పోలీసుల సమక్షంలోనే రాడ్లతో అద్దాలను పగులగొట్టారు. లోపలకు చొరబడి బస్సు తలుపు తెరిచారు. బస్సులో ఉన్న అమరనాథరెడ్డి, అనీష్‌రాయల్, మోహన్‌కృష్ణ యాదవ్, బోగం అనిల్, వెంకటేష్‌పై దాడిచేసి చొక్కా పట్టుకుని ఈడ్చుకెళ్లారు. అప్పటికే సిద్ధంగా ఉన్న వాహనాల్లో కార్పొరేటర్లను బలవంతంగా ఎక్కించి అతివేగంగా దూసుకెళ్లారు. బస్సులో ముందు వైపు కూర్చున్న మహిళా కార్పొరేటర్లను నెట్టుకుంటూ లోపలకు చొరబడడంతో భయభ్రాంతులకు గురయ్యారు. కార్పొరేటర్లు కేకలు వేస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. కార్పొరేటర్లను కాపాడకపోగా మిగిలిన వారిపై దౌర్జన్యానికి దిగారు.

ఎంపీ, సాక్షి ప్రతినిధులపై దాడి

కార్పొరేటర్లతో పాటు బస్సులో ప్రయాణిస్తున్న ఎంపీ గురుమూర్తిపై కూడా కూటమి గూండాలు దాడికి యత్నించారు. బస్సు ముందు సీట్లో కూర్చొని ఉన్న ఎంపీపై రాడ్లతో దాడి చేసేందుకు యత్నించగా గన్‌మెన్‌ను చూసి వెనక్కి తగ్గారు. ఈ అరాచకాలను చిత్రీకరిస్తున్న సాక్షి ప్రతినిధి, సాక్షి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేశారు. ఎమ్మెల్యే కుమారుడు ఆరణి మదన్, సునీల్ చక్రవర్తి ఫోటోగ్రాఫర్ చేతిలోని రూ.రెండు లక్షలు విలువచేసే కెమెరాను లాక్కుని ధ్వంసం చేశారు. సెల్‌ఫోన్లో ఘటనను చిత్రీకరిస్తున్న సాక్షి ప్రతినిధిపై కూడా దాడికి తెగబడ్డారు. ఉదయం 10.15 గంటల నుంచి 10.45 వరకు యథేచ్ఛగా సాగిన విధ్వంసంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. కూటమి నేతల విధ్వంస కాండతో రాకపోకలన్నీ స్తంభించిపోయాయి.

బస్సులో, వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు ఈ ఘటనను చూసి 'ఇంత అరాచకమా? ఇంత బరి తెగింపా?'అంటూ నివ్వెరపోయారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



'సచివాలయం'లో నీడ కరువు

రాష్ట్ర సచివాలయం ప్రధాన గేట్ల వద్ద నిలువ నీడలేక.. వివిధ పనులపై వచ్చే సందర్శకులు, అక్కడ విధులు నిర్వహించే సెక్యూరిటీ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రం నలుమూలలనుంచి వచ్చే ప్రజలు గేట్-2 నుంచి లోపలికి వెళ్లాల్సి ఉంటుంది. అయితే ముందుగా పాస్‌లు తీసుకున్నాక, పోలీసు సిబ్బంది తనిఖీ తర్వాత వారిని అనుమతిస్తారు. ఈ నేపథ్యంలో అక్కడ చాలా సేపు వేచి ఉండాల్సి ఉంటుంది. గేట్ల వద్ద నీడనిచ్చే సదుపాయం లేక ఎండైనా, వానైనా అలాగే ఉండాల్సి వస్తోంది. అలాగే గేట్-4 వద్ద కూడా పరిస్థితి ఇలాగే ఉంది. వచ్చేది ఎండాకాలం కావడంతో ఇక్కడ టెంట్ లాంటివి ఏర్పాటు చేయాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని సందర్శకులు కోరుతున్నారు.

– సాక్షి, హైదరాబాద్

'ఏఐ' అంటే హైదరాబాద్ గుర్తుకు రావాలి

- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- కొత్త సవాళ్లకు యువత సిద్ధంగా ఉండాలి
- డీటీసీసీ కార్యాలయం ప్రారంభించిన మంత్రి



డీటీసీసీ కార్యాలయం ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ)లో రాష్ట్ర యువతను నిపుణులుగా తీర్చి దిద్దాలనే సంకల్పంతో ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. సోమవారం హైటెక్ సిటీలో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సేవలు అందిస్తున్న డిపాజిటరీ ట్రస్ట్ క్లియరింగ్ కార్పొరేషన్(డీటీసీసీ) నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. 200 ఎకరాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏఐ సిటీని నిర్మించనున్నామని, అక్కడే ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేసి, దాని నిర్వహణలో సంబంధిత పరిశ్రమలను, ఏఐ నిపుణులను భాగస్వాములను చేస్తామని చెప్పారు. ఏఐ అంటే తెలంగాణ, హైదరాబాద్ అని గుర్తుకు వచ్చేలా తీర్చి దిద్దుతామన్నారు. రోజురోజుకీ టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోందని, అదే సమయంలో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో యువత వినూత్నంగా ఆలోచించి, వాటి పరిష్కారాల కోసం నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించా రు. ఆ దిశగా కృషి చేసే వారికి ప్రభు త్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలతో పాటు అన్ని రంగాలకు చెందిన కంపెనీలున్నాయని, అలాంటివి 100 నుంచి 120 కంపెనీలు ఇక్కడి నుంచే ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సేవలందిస్తున్నాయని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. అన్ని రకా ల పరిశ్రమలను స్థాపించేందుకు అనువైన వాతావరణం తెలంగాణలో ఉందన్నారు. దేశంలో డీటీసీసీ తన రెండో కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించడం సంతోషంగా ఉందని, తద్వారా సుమారు 500 మందికి కొత్తగా ఉపాధి దొరకబోతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఈ కంపెనీలో 2వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. వీటిలో అధిక శాతం తెలంగాణ యువతకు ఇవ్వాలని కోరగా, అందుకు యాజమాన్యం అంగీకరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీటీసీసీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రెనీ లారోకే మోరీస్, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ లిన్ బిషప్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

తునికాకు టెండర్లు నిర్వహించాలి

ఇల్లెందురూరల్: సీజన్ ముంచుకొస్తున్న నేపథ్యాన తునికాకు సేకరణ టెండర్లు వెంటనే నిర్వహించడంతోపాటు సకాలంలో ప్రూనింగ్ పనులను ప్రారంభించాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ఆరు లక్షల మంది ఆదివాసీ, గిరిజనులకు వ్యవసాయం తర్వాత తునికాకు సేకరణతోనే ఎక్కువ ఆదాయం వస్తుందని తెలిపారు. ఆకు సేకరణకు రాష్ట్రంలో 196 యూనిట్లు ఉండగా, త్వరగా టెండర్ల పిలవడంతో పాటు స్త్రీ, పురుషులకు సమానంగా వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతేకాక 50 ఆకుల కట్టకు ధర రూ.6గా నిర్ణయించాలని ఆయన సూచించారు. తద్వారా ఆకు సేకరణ లక్ష్యాన్ని చేరుకుంటే ప్రభుత్వంతో పాటు కాంట్రాక్టర్లు, కూలీలకు ఆదాయం పెరుగుతుందని తెలిపారు. అంతేకాక ఆకు సేకరణ సమయాన జరిగే ప్రమాదాలకు నష్టపరిహారం చెల్లించాలని, కొన్నేళ్లుగా పెండింగ్ ఉన్న బోనస్‌ను చెల్లించాలని కోరారు. గతంలో బోనస్ చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని అశోక్ డిమాండ్ చేశారు.

రైల్వే ఉద్యోగాలకు దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసిన గ్రూప్–డీ నోటిఫికేషన్‌కు జిల్లాలోని గిరిజన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చని గిరిజన అభివృద్ధి అధికారి విజయలక్ష్మి తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 22వ తేదీలోగా రూ.250చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్‌లో కానీ 77299 61197 నంబర్‌లో కానీ సంప్రదించాలని సూచించారు.

ఇంగ్లిష్ మీడియం.. పౌష్టికాహారం



కారేపల్లిలోని మోడల్ స్కూల్

నోటిఫికేషన్ వివరాలిలా

దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీ	ఫిబ్రవరి 28
ఫీజు	జనరల్ విద్యార్థులకు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీలు, దివ్యాంగులకు రూ.125
హాల్‌టికెట్ల డౌన్‌లోడ్	ఏప్రిల్ 3నుంచి
ప్రవేశపరీక్ష (6వ తరగతి)	ఏప్రిల్ 13 (ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు)
7నుంచి 10వ తరగతుల వారికి	ఏప్రిల్ 13 (మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు)
ఫలితాలు విడుదల	మే 20
ఎంపికైన వారి జాబితా ప్రదర్శన	మే 28
ధ్రువపత్రాల పరిశీలన	మే 29నుంచి జూన్ 3వ తేదీ వరకు

ఉమ్మడి జిల్లాలో రెండు మోడల్ స్కూళ్లు

- ఆరో తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్
- ఈ నెల 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మంసహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలనే ఉద్దేశ్యంతో లక్ష్యంతో 2013–14లో మోడల్ స్కూళ్ల ప్రవేశపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 194 పాఠశాలలను ఏర్పాటు చేయగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండు నెలకొల్పారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించటంతో పాటు రుచికరమైన, పౌష్టికాహారాన్ని అందించాలనే లక్ష్యంతో మోడల్ స్కూళ్లను ఏర్పాటుచేశారు. ఆధునిక వసతులతో పాటు ఇంగ్లిష్ మీడియంలో బోధన జరుగుతోంది. ఈనేపథ్యాన మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి తాజాగా నోటిఫికేషన్ విడుదలైంది.

ఆరు నుంచి ఇంటర్ వరకు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పెనుబల్లి, కారేపల్లిలో మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఈ స్కూళ్లలో 6నుంచి ఇంటర్మీడియట్ వరకు బోధన కొనసాగుతోంది. ఒక్కో తరగతికి 100మందికి ప్రవేశాలు కల్పిస్తారు. అయితే, ఆరో తరగతిలో 100మందికి ప్రవేశాలు కల్పించి వారిని పై తరగతులకు ప్రమోట్ చేస్తుండగా, మిగతా తరగతుల్లో ఎవరైనా మధ్యలో వెళ్లిపోతే ఖాళీలను మాత్రం భర్తీ చేస్తారు. పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పించనుండగా 2025–26వ విద్యాసంవత్సరానికి సంబంధించి నోటిపికేషన్ విడుదలైంది. ఈమేరకు మోడల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం http:/telanganagms.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి..



మోడల్ స్కూళ్లలో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతోంది. ప్రవేశాల షెడ్యూల్ విడుదలైనందున ఎంఈఓల ద్వారా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. – సోమశేఖరశర్మ, డీఈఓ, ఖమ్మం

ఎర్ర తివాచీ పరిచినట్లుగా ...



చర్ల మండలంలో రైతులు సాగు చేసిన మిర్చి చేతికొస్తోంది. ఇప్పుడిప్పుడే కోతలు ఊపందుకుంటుండగా రైతులు మిర్చిని కల్లాలు, రహదారుల పక్కన ఆరబోస్తున్నారు. దీంతో ఏ గ్రామంలో చూసినా ఆయా ప్రాంతాలు ఆరబోసిన మిర్చితో ఎర్ర తివాచీ పరిచినట్లుగా కనిపిస్తున్నాయి. – చర్ల

మంచుతెరలు కాదు.. దుమ్ము పొరలు





కొణిజర్ల పోలీస్‌స్టేషన్ వద్ద..
(ఇన్‌సెట్) తనికెళ్ల వద్ద గాలిలో దుమ్ము

ఈ ఫొటోలు చూడగానే శీతాకాలంలో తెల్లవారుజామున మంచు పొరలు కమ్మేశాయని అనుకోవడం సహజమే. కానీ ఇది నిజం కాదు! రోడ్డుపై దుమ్ము కమ్మేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనపడని చిత్రాలివి. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల కోసం టిప్పర్లలో ఫ్లైయాష్ తరలిస్తుండగా పైన పట్టాలు లేకుండా వెళ్తుండడంతో ఖమ్మం నుంచి వైరా వరకు రహదారిని దుమ్ము ఇలా మూసేస్తోంది. ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారికి ఎదురు వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున టిప్పర్ల డ్రైవర్లకు పోలీసులు సూచనలు చేయాలని కోరుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

కార్మికుల పెన్షన్ ఫండ్ బలోపేతం

- టన్నుకు సెస్ రూ.20గా సీఎంపీఎఫ్ బోర్డ్ నిర్ణయం
- విత్ డ్రాలు పెరుగుతుండడంతో బలహీనమవుతున్న 'ఫండ్'
- ఫలితంగా మార్పులకు ఆమోదం



భూగర్భగనుల్లో పనిచేస్తున్న కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): కోలిండియా పరిధిలోని సింగరేణి సహా తొమ్మిది బొగ్గు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు ఉద్యోగ విరమణ అనంతరం ఎదుర్కొంటున్న పెన్షన్ సమస్య పరిష్కారానికి సీఎంపీఎఫ్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ సమావేశం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గత నెల 17న బీఓటీ చైర్మన్ కమ్ కోల్ సెక్రటరీ సమక్షాన సీఎంపీఎఫ్ ట్రస్ట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్‌కు జమ అయ్యే నగదు కంటే విత్‌డ్రాలు ఎక్కువగా ఉండడంతో పెన్షన్ ఫండ్ బలహీనం అవుతున్న అంశంపై చర్చించారు. ఈనేపథ్యాన పెన్షన్ ఫండ్ పెంచాలని పలు కార్మిక సంఘాల నాయకులు, బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జ్‌లు కోరారు. దీంతో కోలిండియా పరిధిలో ఉత్పత్తి అయ్యే ప్రతీ టన్ను సరుకుకు ప్రస్తుతం కేటాయిస్తున్న రూ.10ను రూ.20కి పెంచారు. కార్మికుల వేతనంలో ఏడు శాతానికి, యాజమాన్యం మరో ఏడు శాతం కలుపుతున్నా పెన్షన్ చెల్లింపుల్లో అసౌకర్యం కలుగుతున్న నేపథ్యాన ట్రస్ట్ ఈ నిర్ణయం తీసుకుంది.

నెలనెలా పెరుగుతున్న పెన్షనర్లు

కోలిండియా పరిధి ఎనిమిది బొగ్గు పరిశ్రమల్లో గతంలో సుమారు 6లక్షల మంది కార్మికులు పనిచేసేవారు. కానీ ఇప్పుడు 3లక్షల మందే ఉన్నారు. అలాగే, సింగరేణిలో పదేళ్ల క్రితం 62 వేల మంది కార్మికులు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 39 వేలకు పడిపోయింది. తద్వారా కోలిండియాలో సుమారు 3లక్షల మంది, సింగరేణిలో 23వేల మంది గడిచిన పదేళ్లలో ఉద్యోగ విరమణ చేశారు. అయితే రోజురోజుకు బొగ్గు పరిశ్రమల్లో కార్మికుల సంఖ్య తగ్గి, పెన్షనర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్లు ఈ గణాంకాలు చెబుతున్నాయి. దీంతో సీఎంపీఎఫ్ ఫండ్‌కు జమ అవుతున్న నగదు కంటే విత్‌డ్రా పెరుగుతోంది. ఈ నేపథ్యాన సెస్ పెంచుతూ సీఎంపీఎఫ్ ట్రస్ట్ ఆమోదం తెలిపింది.

సరైన సమయంలో నిర్ణయం



కార్మికుల సంఖ్యతో పాటే సీఎంపీఎఫ్‌లో ఫండ్ తగ్గుతోంది. ఇదిలాగే సాగితే భవిష్యత్ తరాలకు పెన్షన్ ఇవ్వడం సాధ్యం కాదు. ఈనేపథ్యాన సరైన సమయంలో చర్చించి టన్నుకు చెల్లిస్తున్న సెస్‌ను రూ.20కు పెంచడం మంచి నిర్ణయం.

– రాజేంద్రప్రసాద్, డీజీఎం (పర్సనల్)

మా చొరవతోనే పెంపు



యాజమాన్యం, కార్మికుల భాగస్వామ్యంతో పాటు ప్రతీ టన్నుకు రూ.10 చొప్పున సెస్ జమ చేస్తున్నా కార్మికుల పెన్షన్‌కు సరిపోవడం లేదు. దీన్ని ఎవరూ పట్టించుకోకున్నా మేం రూ.30కి పెంచాలని ప్రతిపాదిస్తే రూ.20కు పెంచారు.

– పి.మాధవనాయక్, బీఎంఎస్ నాయకుడు